# మానసికం

సాయంత్రం ఏడు గంటలు.

ఎండాకాలమేమో గాలి అప్పుడప్పుడే చల్లదనాన్ని సంతరించుకుంటోంది.

తన గదిలో కూర్చుని చదువుకుంటున్న శైలజ యధాలాపంగా తలెత్తి కిటికీలో నుంచి బయటకు చూసింది. కిటికీ ఎదురుగా ఉన్న ఇంటి వరండాలో ఓ నలభై ఏళ్ల వ్యక్తి వాలుకుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్నాడు. ఆయనకి వెనక వరండాకి ఆనుకుని ఉన్న ద్వారం దగ్గర ఓ అమ్మాయి నిలబడుంది. ఆ అమ్మాయికి శైలజ వయస్సే ఉంటుంది. మేడ పైపోర్షన్‌లో శైలజా వాళ్లుండటం వలన ఆ ఇల్లు చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

శైలజ బి.కాం. ఫైనలియర్. రెండు నెలల్లో పరీక్షలు. ప్రిపరేషన్ హాలీడేస్ ఇచ్చి వారం రోజులైంది.

"చదవాల్సింది బోల్డంతుంది. టైమ్ సరిపోతుందో లేదో" అనుకుంటూ తన చూపుల్ని అక్షరాలపైకి తెస్తుండగా ఆకర్షించింది ఎదురింటి అమ్మాయి చేతి కదలిక.

ఎంతందంగా ఊపింది చేతిని.

టెన్సింగ్ నార్కే హిమగిరులపై తనని ప్రతిష్ఠించినప్పుడు శీతల పవనాలు తోడు రాగా ఊగిన త్రివర్ణ పతాకంలా.

ఎందుకూపిందో?

ఎవరికూపిందో?

శైలజ చప్పున కుర్చీలోనుండి లేచి కిటికీ దగ్గరికి వచ్చి ఆమె చెయ్యి ఊపిన దిశగా చూసి నివ్వెరబోయింది.

తమింటికి కాస్త దూరంగా ఎదురింటికి కాస్త ఎడంగా ఉన్న ఖాళీ స్థలంలో రావిచెట్టు

కింద సైకిల్ స్టాండ్ వేసి దాన్ని ఆనుకొని నిలబడ్డాడో అబ్బాయి. అతని చూపులన్నీ ఆ ఇంటివైపే. ఇంటిలో అమ్మాయి పైనే.

అంటే ... అంటే ఆ ఎదురింటమ్మాయి చెయ్యి ఊపిందీ అబ్బాయికా?

ఎందుకు?

ఎవరతను?

శైలజ చూస్తుండగానే ఆ అబ్బాయి ఆ అమ్మాయికి చెయ్యి ఊపి వెళ్లిపోయాడు.

ఆ అమ్మాయి అతను కనిపించినంతమేర చూసి లోపలికి వెళ్లిపోయింది.

శైలజ తిరిగొచ్చి కుర్చీలో కూర్చుంది.

వాళ్లు రోజూ ఇలాగే చేతులు ఊపుకుంటారా?

రోజూ ఇదే టైమ్‌కా?

ఎన్ని రోజుల నుండి ఒకరికొకరు తెలుసో?

అసలెక్కడ పరిచయమైందో?

ఆ అమ్మాయి చదువుకుంటున్నమ్మాయే.

ఇలా అబ్బాయిలతో పరిచయాలు పెంచుకుంటే ఎలా చదువుతుందో?

చదివేదేమైనా గుర్తుంటుందా?

ఏమో! పోన్లే నాకెందుకు? ఎంత చదివినా ఈ మర్కంటైల్ లా తలకెక్కదు. ఫైనలియర్‌లో బాగా ఇబ్బందిపెట్టే పేపర్ ఇదే. బాగా చదవాలి.

ఏన్ ఎగ్రిమెంట్ నాట్ ఎన్‌ఫోర్సబుల్ బై లా ఈజ్ సెడ్ టు బి ... అవునూ పేపర్ చదువుతున్న వ్యక్తి ఆ అమ్మాయి తండ్రా? తండ్రుంటుండగానే చెయ్యి ఊపిందా? ఆయన చూస్తే. అయినా ఇటువం... ప్చ్! నాకెందుకు? ఆఁ ఆఁ ఎక్కడవరకొచ్చాను - ఆఁ ఆఁ టు బి ఆఁ టు బి వైడ్.

★ ★ ★

వారం రోజులు గడిచాయ్.

ఎదురింటమ్మాయిని, రావిచెట్టు అబ్బాయిని గమనించటం శైలజ దినచర్యలో భాగంగా మారింది.

ఆ అబ్బాయి సాయంత్రం చీకటి పడ్డాకే వస్తాడు.

బహుశా పగలైతే ఎవరైనా గమనిస్తారనేమో పగటివేళ కనిపించడు. నలభై ఏళ్ల వ్యక్తి ఆ అమ్మాయి తండ్రి. అతను సాయంత్రం ఆఫీసు నుండి వచ్చాక వరండాలో వాలు కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతుంటాడు. అప్పుడప్పుడు బయటికి వెళుతుంటాడు.

ఆ అబ్బాయి కోసం ఎదురుచూస్తూ కొంతసేపు - ఆ అబ్బాయిని చూస్తూ మరికొంతసేపు - వెళ్లిపోయిన అతడిని తల్చుకుంటూ ఇంకొంతసేపు ఆమె వరండాలోనే చేతిలో పుస్తకముంచుకొని కాలం గడుపుతుంది. చదువుకుంటున్నట్టు నటిస్తూ బాయ్‌ఫ్రెండ్‌ని చూస్తుంది.

మోసం - తల్లిదండ్రులని మోసం చేస్తోంది.

వారి కళ్లు కప్పేసి స్నేహితుడి కళ్లలో దీపాలు వెలిగించాననుకుంటోంది. కానీ - తనని తాను మోసగించుకుంటోందని ఆమెకెప్పుడు తెలుస్తుంది? స్నేహితుడి కళ్లలో తను వెలిగించిన దీపకాంతి తను ఒక్క అడుగు ముందుకెయ్యడానికి కూడా తోడ్పడదని తెలిసేనాటికి ఆమెకేం మిగుల్తుంది?

ఆ అబ్బాయి తమకంటే సంవత్సరమో, రెండేళ్లో పెద్దవాడై వుండొచ్చు. ఏం చదువుతున్నాడో?

శైలజ ఆలోచనలని స్తంభింపచేస్తూ రెండు నిమిషాలు ఆ అబ్బాయి - అమ్మాయిల మధ్య చాలా వేగంగా ముద్దుల రవాణా జరిగింది.

ఫ్లయింగ్ కిసెస్!

ఆశ్చర్యంతో శైలజ కళ్లింతచేసుకుని వాళ్లవైపు చూస్తుండిపోయింది.

ఎంత నీచం!

ఎంత అసహ్యం!

పెళ్లి కాకుండా మరో అబ్బాయి గురించి ఆలోచించటమే పాపం.

ఈ అమ్మాయి బరితెగించి ముద్దులు అందుకుంటోంది.

శరీరాలు తగలకపోతేనేం? భావన చాలదూ పవిత్రత పోవటానికి?

శైలజ విసురుగా లేచి కిటికీ తెరలు దగ్గరికి లాగి మంచంపై వాలింది.

ఆ అమ్మాయి ఆ ముద్దుకి ఎలా ఫీలయిందో?

ఈ సంఘటన గుర్తొచ్చి రాత్రంతా నవ్వుకుంటుందేమో - చిన్నపిల్లలు అకారణంగా నవ్వుకున్నట్టు.

ఆ అబ్బాయి ఏం చేస్తాడో?

తొలి ముద్దంటూ పార్టీ ఇస్తాడా స్నేహితులకి?

నిజంగా ఆ అబ్బాయికి తొలి ముద్దేనా?

అతనికి ఈ అమ్మాయి తప్ప మరే గర్ల్ ఫ్రెండ్స్ లేరా?

ప్చ్! ప్రిపరేషన్ హాలీడేస్‌ని పరీక్షలకి ప్రిపేర్ కమ్మనిస్తే ఆ అమ్మాయి పెళ్లికి ప్రిపేరవుతూంది.

ఇది పెళ్లివరకు దారితీస్తుందా?

పెళ్లా!

చదువులు పూర్తికాలేదు. ఉద్యోగాలెక్కడనుంచొస్తాయి?

పెద్దల అనుమతి, ఆర్థిక స్వాతంత్ర్యం లేని ఈ ప్రేమికులు పెళ్లెలా చేసుకుంటారు? చేసుకున్నా ఎలా బ్రతుకుతారు?

ఒకరికొకరు ప్రేమని వడ్డించుకొని కన్నీటిని తాగుతారేమో!

★ ★ ★

శైలజ చాలా ఆత్రుతగా రావిచెట్టు వైపు చూస్తోంది.

ఎదురింటమ్మాయి తండ్రి సంచి పట్టుకుని బయటికి వెళ్లాడు.

కూరలు తేవడానికి కావచ్చు. తండ్రి వెళ్లిన అయిదు నిముషాలకి ఆ అమ్మాయి అటు ఇటు చూసి ఎవరూ తనని గమనించటం లేదని నిర్ధారించుకొని రావిచెట్టు దగ్గరున్న అతని దగ్గరికి త్వరత్వరగా నడిచింది.

వాళ్లిద్దరూ ఇలా దగ్గరగా కల్సుకోవటం శైలజ ఎప్పుడూ చూడలేదు.

ఆ అమ్మాయి ఏదో చెప్పింది.

అతను నవ్వాడు.

ఆ అబ్బాయి ఏదో అన్నాడు.

ఆమె నవ్వింది.

లేత వెల్తుర్లో ఆ ఇద్దర్నీ చూస్తుంటే ఆమెకి ఆనాటి లైలా - మజ్నూ నుంచి ఈనాటి బాలు - స్వప్న గుర్తొచ్చారు.

అయ్యయ్యో! ఈ అమ్మాయికి అస్సలు భయం లేదా?

తండ్రొచ్చేస్తే?

తల్లి వరండాలోకి వస్తే?

ఎంతల్లరి? ఎంత గొడవ?

వెళ్లిపో! ఇంట్లోకి వెళ్లిపో!

వెళ్లదేం?

ఏం చెపుతుంది?

ప్రపంచాన్ని మరిచిపోయినంత తన్మయం ఏమిటో?

ఏముందా అబ్బాయిలో?

చదువుని, తల్లిదండ్రుల్ని మరిపించేంత ఆకర్షణ అతనిలో ఎక్కడుంది? చాలా సేపయింది. వెళ్లదేం? తండ్రంటే భయం లేదా?

నా పిచ్చికాకపోతే ఆమెకెందుకు భయం?

పరీక్షలంటేనే శ్రద్ధ, భయం లేని ఆమెకి తండ్రి భయమా? తెగించిన వాళ్లకి భయమేంటి?

శైలజ చికాకుగా వచ్చి చదువుతున్న ఆడిటింగ్ పుస్తకం మూసి అకౌంటెన్సీ తీసింది.

ఆ అమ్మాయి అక్కడే వుందా?

శైలజ కిటికీ వైపు చూసింది.

ఆ అమ్మాయి మాట్లాడుతూనే ఉంది.

శైలజ రోడ్డు చివరికి చూసింది.

ఆ అమ్మాయి తండ్రి వస్తూ కనిపించాడు.

అరెరె! అతను వచ్చేస్తున్నాడు. ఆ అమ్మాయి చూడలేదు.

ఈరోజు దొరికిపోతుందా?

కూతుర్ని కొడతాడా?

ఆ అబ్బాయిని మందలిస్తాడా?

శైలజ చాలా ఆత్రుతగా ఆ అమ్మాయినీ, తండ్రినీ మార్చి మార్చి చూస్తోంది.

ఆ అమ్మాయి తలతిప్పి రోడ్డువైపు చూసి చాలా నెమ్మదిగా తన ఇంటివైపు నడిచింది.

ఆ అబ్బాయి సైకిల్ చెయిన్ పెడుతున్నట్టు కిందికి వంగాడు.

శైలజని నిరాశ ఆవరించింది.

తనెంతో అమాయకురాలు. ఆ అమ్మాయి చాలా అనుభవజ్ఞురాలిలా వుంది.

ఎంత నెమ్మదిగా ఏ బెదురూ లేకుండా వెళ్లిందో?

ప్రేమించటం మొదలుపెట్టాక ఎదురయ్యే సమస్యలనుండి బయటపడటానికి అనుభవం ఏముండక్కర్లేదు. ఆ విషయం తెలియని శైలజ చాలాసేపు ఎదురింటమ్మాయికి ప్రేమ వ్యవహారాలలో అనుభవమెంతని ఆలోచిస్తూ కూర్చుంది.

అకౌంటెన్సీ నోటు పుస్తకం పేపర్లు గాలికి టపటపా కొట్టుకుంటున్నాయి.

★ ★ ★

శైలజ రెప్ప వాల్చకుండా ఎదురింటివైపు చూస్తోంది.

సరిగ్గా ఓ అయిదు నిముషాల క్రితం ఆ అబ్బాయి ఎదురింటమ్మాయికి ఓ కాగితం గోడపైనుండి అందించాడు.

ప్రేమలేఖ!

ఏం రాశాడో?

నా హృదయ సామ్రాజ్యానికి పట్టపురాణివని రాసుంటాడా?

ఆ అమ్మాయి జవాబిస్తుందా?

ఏమనిస్తుంది?

అసలిస్తుందా లేదా?

ఆరాత్రి పదకొండు గంటలప్పుడు ఆ అమ్మాయి గోడపైనుండి ఆ అబ్బాయికి ఉత్తరం అందించింది.

నేను ఫలానా టైమ్‌కి వస్తానని ఆ అబ్బాయి ముందే చెప్పుంటాడు. లేకపోతే ఆ అబ్బాయి వచ్చే టైమ్ ఆమెకెలా తెలుస్తుంది?

ఏమని సంబోధించిందో?

డియర్ మీ,

మై డియర్

డియర్ డియర్!

ప్రియమైన!

ప్రియాతి ప్రియమైన!

ఆఁ ఏదో ఒకటి. ఎలా మొదలుపెట్టినా ప్రేమనే వ్యక్తం చేస్తుంది.

ఏం రాసిందో?

వికసించే మల్లెల గురించో, విరిసిన వెన్నెల గురించో, పాడనని అలిగే కోయిల గురించో రాసుంటుంది.

అంత భావుకత ఆమెకుందా?

ఉండి ఉండదు.

ఏ సల్వార్ కమీజ్ గురించో, ఏ సినిమా గురించో, అమ్మా నాన్న కట్టడి గురించో రాసుంటుంది.

మరో వారం రోజుల వరకు ఆ అబ్బాయి రాసిన లేఖా ప్రపంచంలోనే విహరిస్తుందనుకుంటా ఆ అమ్మాయి.

★ ★ ★

పరీక్షలు మూడు రోజులున్నాయనగా శైలజ హాల్ టికెట్టు తీసుకోడానికి కాలేజీకి వెళ్లింది. ఆమె వెళ్లేసరికి క్యూ పెద్దగా ఉంది. క్యూలో నిలబడిన అయిదు నిముషాలకి యధాలాపంగా వెనక్కి చూసిన శైలజ తన కళ్లని తానే నమ్మలేకపోయింది.

ఎదురింటమ్మాయి

పరీక్షలు రాస్తుందా?

రాయటం దండగ.

పోయే పరీక్ష కోసం గంటలు గంటలు నిలబడి హాల్ టికెట్టు తీసుకోవటమెందుకు? పరీక్ష హాల్‌లో దిక్కులు చూడటానికా?

టైమ్ వేస్ట్!

ఫీజ్ వేస్ట్!

ఆ ప్రేమించినవాడు మోసం చేస్తే బ్రతుకే వేస్ట్.

ఆ అమ్మాయికి బుద్ధి చెప్పాలి.

ప్రేమతో మూసుకుపోయిన కన్రెప్పల్ని విప్పి చదువుపై దృష్టిని ప్రసరింపచెయ్యాలి.

"ఎలా?" ఆలోచిస్తున్న శైలజకి ఐడియా తట్టింది. వెంటనే వెనక్కి తిరిగి "నాపేరు శైలజ... బి.కామ్. ఫైనలియర్. మీపేరు?" అంది తనని తాను పరిచయం చేసుకుంటూ.

"శారద - బి.ఏ. ఫైనలియర్" అందా అమ్మాయి.

పరీక్షల గురించి, కాలేజీ గురించి మాట్లాడుకుంటుండగా శైలజ కౌంటర్ దగ్గరికి వచ్చింది.

ఆమె హాల్ టికెట్టు తీసుకొని శారద వచ్చేవరకు ఆగింది.

ఇద్దరూ ఒకరి నంబర్లు ఒకరు తీసుకొని "బెస్ట్ ఆఫ్ లక్" చెప్పుకొని ఒకరింటికి

మరొకరు ఆహ్వానించుకుని ఎవరిళ్లకు వాళ్లు చేరుకున్నారు.

★ ★ ★

ఆరోజు సాయంత్రం స్పెషల్ ఇష్యూలో డిగ్రీవాళ్ల రిజల్ట్స్ అనుకున్న దానికంటే ఒక రోజు ముందే వచ్చాయి.

ఆత్రుత, ఆనందం శైలజని నిలవనివ్వటం లేదు.

శారద పరీక్ష తప్పకుండా పోతుంది. ఆమెని సంస్కరించే అవకాశం వచ్చేస్తుందన్న ఆనందం, తనకి ఫస్ట్ క్లాసా, సెకండ్ క్లాసా తెలుసుకోవాలనే ఆత్రుత.

చిన్నగా కంపిస్తున్న చేతులతో పేపర్ తీసుకొని నంబర్ కోసం వెతికిందామె.

రిజల్ట్స్ కోసం పేపర్ పట్టుకున్న ప్రతిసారీ ప్రతి విద్యార్థిలో సంచలనం ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్తగా అదే మొదటిసారన్నట్టుంటుంది. ఆ స్వచ్ఛతే మరోసారి రిజల్ట్స్ కోసం ఎదురు చూసే స్ఫూర్తినిస్తుంది.

ఫస్ట్ క్లాస్!

సెకండ్ క్లాస్!

థర్డ్ క్లాస్!

లేదు. ఎక్కడా శైలజ నంబర్ కనిపించలేదు.

ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐ.... ఊహూఁ ఎన్నిసార్లు చూసినా ఆమెకి తన నంబర్ కనిపించలేదు.

శైలజ బి.ఏ. రిజల్ట్ ఉన్న పేపర్ అందుకొని శారద నంబర్ కోసం వెతికింది.

థర్డ్ క్లాస్‌లో కనిపిస్తున్న శారద నంబర్ వైపు ఆమె అపనమ్మకంగా చూసింది.

ఇదెలా సాధ్యం?

శారద పాసైంది.

తను ఫెయిలయింది.

ఆలోచన! ఆలోచన! ఆలోచన!

ఆరాత్రి – "వ్యక్తి పూర్తి స్వేచ్ఛగా ఉండాలి. ఊగిసలాటతో అటు సగం, ఇటు సగం ఉంటే ఫలితం నా పరీక్షల రిజల్ట్" అని డైరీలో రాసుకుంది శైలజ.

• ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 9, మార్చి 1988 •